
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ♦ 16 ♦ ఆగస్టు ♦ 2025



30,150 క్యూసెక్కుల వరద

సోమశిల జలాశయానికి శుక్రవారానికి 30,150 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 1850, ఉత్తర కాలువకు 340, కండలేరుకు 7800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 45.501 టీఎంసీలు ఉన్నాయి.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,261
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,539
నవర (8 గ్రాములు)	రూ.76,312

గరిష్ఠం/కనిష్ఠం
35.0 /27.0

వాతావరణం

జిల్లాలో శనివారం మేఘావృతంగా ఉండి, ఉరుములు, మెరుపుల వాతావరణం ఉంటుంది. శుక్రవారం గాలిలో తేమ 58 శాతం గా నమోదైంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల ఆకలి కేకలు

• ఎమ్మెల్యే రాక ఆలస్యం కావడంతో..

సాక్షి టాస్క్‌ఫోర్స్: పట్టణంలో డీఎల్‌ఎన్నార్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆలస్యంగా మొదలయ్యాయి. దీంతో విద్యార్థులు ఉదయం నుంచి కనీసం అల్పాహారం కూడా లేక అలమటించారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండడంతో విద్యార్థులందరూ అల్పాహారం కూడా తినకుండా ఉదయం 7 గంటలకే వివిధ కార్యక్రమాలు నిర్వహించడానికి విద్యార్థులు గ్రౌండ్‌కు చేరుకున్నారు. అయితే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రావడం ఆలస్యం కావడంతో ఆమె కోసం ఎదురు చూసి చూసి అసహనానికి గురయ్యారు. దాదాపు 10 గంటలకు మొదలైన కార్యక్రమం 1.10 గంటల వరకు సాగింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి హాజరైన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయలేదు. ఇంకేం చేయలేక ఆకలి కేకలతోనే విద్యార్థులు వెనుదిరిగారు. సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డుల ప్రదానం మిగిలి ఉండగానే ఎమ్మెల్యే వెళ్లిపోయారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్, కౌన్సిలర్లు విద్యార్థులు, ఉద్యోగులకు అవార్డులు అందజేశారు.

స్త్రీ శక్తి పథకం ప్రారంభం



ఉచిత బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఆర్టీసీ చైర్మన్ సురేష్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో స్త్రీ శక్తి పథకాన్ని మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి నవాబుపేట వరకు ర్యాలీగా ప్రారంభమైన బస్సుల్లో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఆర్టీసీ రీజియన్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి, నుడా చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, నాయకులు గిరిధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్, జిల్లా ప్రజా రవాణా అధికారి షమీమ్ ప్రయాణించారు. కాగా ఈ పథకానికి సంబంధించి మహిళల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు.

సాంఘిక సంక్షేమ శాఖకు దక్కని ప్రశంసలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని 71 ప్రభుత్వ శాఖల్లో విశిష్ట సేవలు అందించిన 332 మందికి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రశంసా పత్రాలను అందజేశారు. అయితే జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, సోషల్ వెల్ఫేర్ రెండింటికి ఒక్కటంటే ఒక్క ప్రసాంశ పత్రం కూడా రాలేదు. ఆ శాఖలోని అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యం తాండవిస్తున్న నేపథ్యంలో ఈ దఫా ఈ శాఖలో ఏ ఉద్యోగికి కూడా ప్రశంసలు లేవంటే, విశిష్ట సేవలు దేవుడు ఎరుగు కనీస సేవలు కూడా అందించలేదని స్పష్టమవుతోంది. సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా, కార్పొరేషన్ ఈడీగా ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని సంక్షేమ శాఖలో 71 హాస్టళ్లల్లో 71 వార్డెన్లు, నలుగురు ఏఎస్‌డబ్ల్యూఓలు, కార్యాలయంలో 15 మందికి పైగా, కార్పొరేషన్ కార్యాలయంలో 10 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. మొత్తం 150 మంది సిబ్బంది పని చేస్తున్నారు. అయినా ఒక్కరికీ కూడా స్వాతంత్ర్య దినోత్సవ ప్రశంస అందలేదంటే ఆ శాఖ పనిచేస్తున్న తీరుపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారి వద్ద నుంచి వార్డెన్ల పనితీరు, ఇటీవల ట్రాన్స్‌ఫర్‌పై వచ్చిన ఆరోపణలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై వ్యవహరిస్తున్న తీరు ఇందుకు కారణమై ఉండొచ్చు అని శాఖలో పనిచేస్తున్న వారే అంటున్నారు. ఈ విషయమై సోషల్ వెల్ఫేర్ డీడీకి ఫోన్ చేసినా స్పందించలేదు.

భారీగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

బిట్రగుంట: దగదర్తి, బోగోలు మండలాల పరిధిలోని అటవీ ప్రాంతం, కప్పరాళ్లతిప్ప సమీపంలోని పలు ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. భారీ యంత్రాలు, టిప్పర్ల సాయంతో గ్రావెల్ తరలిస్తుండడంపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకులు సిండికేట్‌గా మారి రాత్రిళ్లు గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై చర్యలు చేపట్టాల్సిన రెవెన్యూ, మైనింగ్, పోలీసుల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతోపాటు ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులతోపాటు మీడియాకు ముడుపులు ముట్టచెబుతున్నామని చెబుతూ అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సగర్వంగా.. త్రివర్ణ వీచికలు

• ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
• స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటిన ప్రదర్శనలు
• విశిష్ట సేవలందించిన 332 మందికి అవార్డుల ప్రదానం
• జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి: మంత్రి నారాయణ



మాట్లాడుతున్న మంత్రి నారాయణ, వేదికపై కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ తదితరులు

గర్వగాథలతో స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటుతూ జిల్లా వ్యాప్తంగా వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. ఆకాశ వీధుల్లో మువ్వన్నెల వీచికలు దేశపు గర్వ ధ్వజమై రెపరెపలాడాయి. త్రివర్ణ తరంగం తరం తరం గౌరవానికి ప్రతీకగా.. వీధివీధిన అలరారగా, పట్టణం నుంచి పల్లె వరకు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో దేశభక్తి గర్వగీతమై ఉప్పొంగింది. పోలీస్ పరేడ్ మైదానంలో మంత్రి నారాయణ, కలెక్టర్, ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ జాతీయ పతకాన్ని ఎగురవేశారు. విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. చిన్నారులు మహనీయుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

నెల్లూరు (అర్బన్): సంక్షేమంతోపాటు అభివృద్ధే ధ్యేయంగా జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. 79వ స్వాతంత్ర్య వేడుకలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరిగాయి. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. అనంతరం శాంతికపోతాలను, బెలూన్లను ఎగురవేశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర సాధన కోసం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ డాక్యుమెంట్లను తయారు చేశామన్నారు. ఈ ప్రణాళికలో ప్రథమ లక్ష్యమైన పీ4 విధానం ద్వారా జిల్లాలో 38,465 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి

జిల్లాలోని రైతులకు అండగా అన్నదాత సుఖీభవ పథకం కింద 1.96 లక్షల మందికి రూ.132 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 1,454 రైతులకు రూ.6.8 కోట్ల విలువైన యంత్రపరికరాలను రూ 2.83 కోట్ల సబ్సిడీతో అందించామన్నారు. 80 శాతం సబ్సిడీతో 33 వ్యవసాయ డ్రోన్లను సరఫరా చేశామన్నారు. నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్– ఆయిల్ పామ్ పథకం కింద రూ.7.62 కోట్ల రాయితీని 3,685 మంది రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. 14,820 ఎకరాల్లో బిందు, తుంపర్ల సేద్య పరికరాలను అమర్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. మెట్ట ప్రాంత వరప్రదాయిని ఆనం సంజీవరెడ్డి సోమశిల ఎత్తిపోతల పథకం ఫేజ్–1 కింద రూ.854 కోట్ల అగ్రిమెంట్‌కు రూ.533 కోట్ల పనులు పూర్తి చేశామన్నారు. మేజర్, మైనర్ ఇరిగేషన్ ద్వారా రూ.15 కోట్లతో చేపట్టిన 244 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 30 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పించేందుకు 850 ఎకరాల విస్తీర్ణంలో రామాయపట్నంపోర్టు రూ.3,700 కోట్లతో నిర్మాణంలో ఉందన్నారు. ఆరు వేల మంది ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50లకే సరఫరా చేస్తున్నట్లు వివరించారు. రూ.37.26 కోట్లతో 1.62 లక్షల విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం కింద ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 2.90 లక్షల మందికి రూ.434.56 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు.

పరిశ్రమల స్థాపనకు చేయూత

జిల్లాలో 42 భారీ పరిశ్రమలు, రూ.41 వేల కోట్ల పెట్టుబడితో 19 వేల మందికి ఉపాధి కల్పిస్తూ స్థాపించామన్నారు. 53 వేల సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రలు ఉన్నాయన్నారు. వీటన్నింటికి ప్రభుత్వం పరంగా చేయూతనిస్తున్నామన్నారు. ఆత్మకూరు నారంపేట వద్ద 173.67 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు అభివృద్ధి పరిచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం 789 ప్లాట్లు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీ కార్తీక్, డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, నెల్లూరు, ఆత్మకూరు ఆర్డీఓలు అనూష, పావని తదతరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పంద్రాగస్టు వేడుకలు



100 అడుగుల స్థూపం వద్ద జాతీయ పతాకం ఆవిష్కరణకు ముందు మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓలు

నెల్లూరు రూరల్ : 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు కలెక్టరేట్‌లో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని జాతిపిత విగ్రహానికి కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్‌ఓ హుస్సేన్‌సాహెబ్, పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 100 అడుగుల స్థూపం వద్ద జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం చిన్నారులకు కలెక్టర్ మిఠాయిలు పంచి పెట్టారు. కలెక్టరేట్ ఏఓ విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డీసీఓ గుర్రప్ప, సమాచార పౌరసంబంధాల అధికారి ఎ.శివశంకర్‌రావు, పౌర సరఫరాలశాఖ అధికారి విజయ్‌కుమార్, కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం

• ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైమ్): దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, వారి త్యాగ ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. శుక్రవారం79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ క్యాంపు, జిల్లా పోలీసు కార్యాలయాల్లో ఆయన జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. స్వాతంత్ర్య సమర స్ఫూర్తితో సిబ్బంది విధులకు పునరంకితం కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కుటుంబ సభ్యులు, ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్‌బీ డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• వెంకటాచలం మండలం చెముడుగుంటలోని డీటీసీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గిరిధర్‌రావు, ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ, ఆర్‌ఐ డి. శ్రీనివాసరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాకు గౌరవవందనం చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ఘనంగా జెండా పండగ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఆ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వతంత్రానికి పూజ్య బాపూజీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువస్తే.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలకులు ఆంగ్లేయులను తలదన్నే రీతిలో నియంతల్లా పాలిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు గొప్ప పాలన అందించారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులు ఆటవీక రాజ్యాన్ని తలపిస్తున్నాయన్నారు. టీడీపీ అకృత్యాలను చూసి ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తోపాటు కొంతమంది మహనీయులు కృషితో భారతదేశానికి గొప్ప రాజ్యాంగం తీసుకు వచ్చి ప్రజాస్వామ్య విలువలను సంరక్షించేలా విధానాలు రూపొందిస్తే ఈ రోజు ఆ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. పులివెందుల ఎలక్షన్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన తీరు దుర్మార్గమన్నారు. పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకొని మీడియా గొంతు నొక్కి పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో చేసిన అరాచకం ప్రజలందరూ చూశారన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, కాకాణి పూజిత

జాతీయ పతాకానికి అవమానం

• జనార్దనపురం పాఠశాలలో ఉల్టాగా కట్టి ఎగురవేసిన వైనం

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు మండలం జనార్దనపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాకు తీవ్ర అవమానం జరిగింది. జాతీయ పతాకాన్ని ఉల్టాగా కట్టి ఎగువ వేయడంతో కషాయం కిందకు, ఆకు పచ్చ పైకి ఉండేలా ఎగురుతూ కనిపించింది. బాధ్యత కలిగిన ఉపాధ్యాయుడు ఆవుల రాజు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. జాతీయ పతాకం ఎగురవేసిన సమయంలో అయినా తప్పును గుర్తించి తిరిగి ఎగురవేయాల్సిన సదరు ఉపాధ్యాయుడు బాధ్యతారాహిత్యంగా జెండా వందనం చేయడం గమనార్హం. జాతీయ పతాకం ఎగురవేసే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. చినిగిపోయినా, రంగు వెలిసిన జెండాలను వినియోగించకూడదనే తెలిసినా.. చివరన చినిగిపోయిన జెండానే ఎగురవేయడంతో ఉపాధ్యాయుడి నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. జాతీయ జెండాకు అవమానం జరిగిన తీరును గ్రామస్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. వింజమూరు ఎంఈఓ రమేష్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఈ విషయమై ఎంఈఓను వివరణ కోరగా, జెండా తిరగేసి కట్టిన మాట వాస్తవమే అని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తే విచారణ చేస్తామని తెలిపారు.



జనార్దనపురం పాఠశాలలో తిరగవేసి కట్టిన జాతీయ జెండా

ఆక్రమిత భూమిలో పనులు చేస్తున్న దృశ్యం



టీడీపీ నేత దర్జాగా కబ్జా


• ఐదెకరాల భూమిని గుట్టుచప్పుడు కాకుండా కాజేస్తున్న వైనం
• రెవెన్యూ అధికారులను లోబర్చుకుని రికార్డుల తారుమారు
• ఎస్సీ కాలనీ వాసులు అడ్డుకున్నా.. లెక్కచేయని వైనం
• పట్టించుకోని రెవెన్యూ అధికారులు



ఆక్రమిత భూమిలో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

వింజమూరు (ఉదయగిరి): ప్రభుత్వ భూమి కనిపిస్తే అక్రమార్కులు వాలిపోతున్నారు. వాగు, వంక, శ్మశాన భూమి, పోరంబోకా, అనాధీనమా? అనేది కూడా చూడడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారాన్ని అడ్డం పెట్టుకొని, రెవెన్యూ అధికారులను లోబర్చుకుని ఆక్రమిస్తున్నారు. సామాన్య ప్రజలు ప్రశ్నస్తే దౌర్జన్యం చేస్తూ అక్రమ కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. ఇలాంటి ఘటననే వింజమూరు మండలం శంఖవరం పంచాయతీ వెంకట్రాదిపాళెంలో జరుగుతోంది. మండలంలోని వెంకట్రాదిపాళెం గ్రామ సర్వే నంబరు 253లో సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి గ్రామ ఎస్సీ కాలనీకి అనుకుని తారు రోడ్డుకు పక్కనే ఉంది. ఈ భూమి ఎన్నో ఏళ్ల నుంచి ఎస్సీ కాలనీ వాసులు తమ ఉమ్మడి అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు. ఇళ్ల స్థలాల పట్టాల కోసం గతంలో ప్రభుత్వ అధికారులకు అర్జీలు కూడా ఇచ్చారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ అధికార పార్టీ నేత విలువైన ఈ భూమిపై కన్నేశారు. తన పలుకుబడితో నిబంధనలకు వ్యతిరేకంగా రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకుని పాత మ్యానువల్ అడంగళ్లలో సదరు నేతకు అనుకూలమైన పేరు రాయించుకున్నారు. దీనిని ఆసరా చేసుకుని పట్టదారు పాస్‌పుస్తకాలు తీసుకున్నారు. గ్రామ రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొంత కాలంగా గుంభనంగా ఉన్న సదరు నేత ఇటీవల ఆ భూమి కబ్జా చేసే ప్రక్రియ మొదలు పెట్టి చెట్లు తొలగించారు. దీంతో ఎస్సీ కాలనీ వాసులు తీవ్రంగా ప్రతిఘటించారు. అయినా ఆ నేత పనులు ఆపకుండా బెదిరింపులకు దిగారు. దీంతో కాలనీ వాసులు స్థానిక వీఆర్వో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో శుక్రవారం సదరు నేత ట్రాక్టర్ ద్వారా నాగలి తెచ్చి దున్నకం చేశారు. జేసీబీని ఉపయోగించి నేలను చదును చేసే పనులు చేపట్టారు. దీంతో స్థానికులు మరోసారి అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపై దూషణకు దిగారు. దీంతో వారు తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. ఆయన వీఆర్వోకు తెలిపమని చెప్పి పెట్టేశారని ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలమనే అలుసా



తరతరాలుగా మా ఉమ్మడి అవసరాల కోసం ఉంచుకున్న విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేయడం అన్యాయం. మేము ఎస్సీలు, పేదలం కావడంతో మా మాటలు అధికారులు, రాజకీయ పార్టీ నేతలు లెక్క పెట్టడం లేదు. 150 ఎకరాలు భూమి ఉండే భూస్వామి ఆక్రమణకు చేస్తుంటే రెవెన్యూ అధికారులు చూస్తూ ఉన్నారు. అధికార పార్టీ అయితే అన్యాయంగా అక్రమణ చేసి మా కడుపులు కొడతారా?

– యేద్ల బాబు, కాలనీవాసి

ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి



మా గ్రామ సర్వే నంబరు 253లో సుమారు 5 ఎకరాలు ప్రభుత్వ భూమి మా కాలనీ అనుకొని ఉంది. అనాదిగా కాలనీ అవసరాల కోసం వాడుకుంటున్నాం. ఈ స్థలాన్ని నివేశాలకు పట్టాలు ఇవ్వాల్సిందిగా అధికారులను కోరుతున్నాం. ఈ భూమి విలువైనది కావడంతో మా గ్రామానికి చెందిన టీడీపీ నేత నకిలీ రికార్డులు సృష్టించి కబ్జా చేస్తున్నారు. ఈ భూమి పోతే మేము ఇక్కడ ఉంటే పరిస్థిది లేదు.

– వల్లపల్లి చిన్నహజరత్, ఎస్సీ కాలనీ

మాకు సెంట్ వ్యవసాయ భూమి లేదు



మా కాలనీలో చాలా మందికి సెంటు భూమి కూడా లేదు. ఈ భూమి కబ్జా చేస్తున్న వ్యక్తికి 150 ఎకరాల భూమి ఉంది. ఇదే కాకుండా గ్రామంలో చాలా చోట్ల ప్రభుత్వ భూములు కబ్జా చేసి స్వాధీనం చేసుకున్నారు. మా లాంటి పేదలకు మాత్రం సెంట్ భూమి లేదు. మేము అడిగితే బెదిరింపులు తప్పుడం లేదు. అధికారం మాది అంటూ దౌర్జన్యం చేస్తున్నారు.

– వెంకటమ్మ

రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటాం

గ్రామ 253 సర్వే నంబరుకు సంబంధించి మాన్యువల్, ఆన్‌లైన్ అడంగళ్‌లో పేర్లు ఉన్నాయి. గతంలో ఉన్న అధికారులు పట్టాదారుపాస్ పుస్తకాలు ఇచ్చారు. వీటిని లోతుగా పరిశీలించి ఫేక్, లేక ఒరినల్ అనే విషయాలు తేల్చాలి. అప్పటి వరకు ఎవరు ఈ భూమిలో ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– రవితేజ, వీఆర్వో

తిరంగా.. మదినిండా..

నెల్లూరు(అర్బన్): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పహల్గాం ఘటనపై కోవూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 70 మంది విద్యార్థినులు ప్రదర్శన ఇచ్చారు. కావలి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల బాలికల జయహో.. జయహో, నగరంలోని ఎస్ఆర్‌కే నెక్స్ జనరేషన్ ఇస్కాన్ సిటీ ఉన్నత పాఠశాల విద్యార్థుల హమ్ ఇండియా వాలా ప్రదర్శనలు దేశ గొప్పతనాన్ని చాటాయి.

- విద్యాశాఖ శకటం ప్రథమ బహుమతి, నెల్లూరు నగరపాలక సంస్థ శకటం రెండో స్థానం, వ్యవసాయ అనుబంధ శాఖ శకటం తృతీయ స్థానంలో నిలిచాయి.
- ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్లకు సంబంధించిన 55 మంది మాజీ సైనికులకు 180 ఎకరాల అసైన్డ్ భూములను పట్టాలుగా అందజేశారు.
- వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు పరిశీలించారు.
- డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 10 మంది చిరు వ్యాపారులకు చేయూతనిచ్చారు. అలాగే ఐటీడీఏ ఆధ్వర్యంలో కుట్టుమెషీన్లు, జ్యూట్ బ్యాగ్ కుట్టుమెషీన్లు, చేపలు పట్టేవారికి సైకిళ్లు, వలలు పంపిణీ చేశారు.



కావలి ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన



కుమారుడితో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ కృష్ణకాంత్



కుమార్తెతో విచ్చేసిన జేసీ కార్తీక్



కోవూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినుల ప్రదర్శన



హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి తదితరులు

ప్రమాదవశాత్తు బావిలో పడి..

- వ్యక్తి మృతి

కొండాపురం: మండలంలోని గరిమెనపెంట గ్రామంలో ఓ వ్యక్తి నేలబావిలో పడి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై మాల్యాద్రి కథనం మేరకు.. పిక్కిలి మనోహర్ (21) గురువారం గరిమెనపెంటలోని తన బంధువుల ఇంటికి వచ్చి మద్యం తాగాడు. ఎదురుగా ఉన్న నేలబావి వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10



క్లుప్తంగా

సీఎం చేతుల మీదుగా ఐపీఎం స్వీకరణ



శ్రీహరిరావు

నెల్లూరు(క్రైమ్): విజయవాడ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో నెల్లూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అక్కిశెట్టి శ్రీహరిరావు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఇండియన్ పోలీసు మెడల్ (ఐపీఎం) స్వీకరించారు. గతేడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ఆయనకు ప్రకటించింది శ్రీహరిరావును పలువురు పోలీసు అధికారులు అభినందించారు.

అసిస్టెంట్ కమిషనర్‌కు అవార్డు



అవార్డును అందుకుంటున్న దయాసాగర్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు ఏసీ (అసిస్టెంట్ కమిషనర్) పి.దయాసాగర్, హెడ్‌కానిస్టేబుల్ ఎం.కిరణ్‌సింగ్‌కు అవార్డులు వరించాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు.

50 మద్యం బాటిళ్ల స్వాధీనం

వెంకటాచలం: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులో తీసుకుని 50 బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని చవటపాళెంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలో అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నారని వెంకటాచలం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై ఆంజనేయులు తన సిబ్బందితో గ్రామానికి వెళ్లి రామాలయం వద్ద ఉన్న రావుల ఉదయ్‌కుమార్ అనే వ్యక్తిని విచారించారు. అతని వద్ద సుమారు రూ.6,500 విలువైన 50 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వాటిని నెల్లూరు నగరంలోని మందాకిని షాప్ నుంచి తీసుకొస్తున్నానని చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశిష్ట సేవలకు ప్రశంసలు

నెల్లూరు(అర్బన్): వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు.



మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు | వై.నాగశేఖర్, సర్వే, భూ రికార్డుల అధికారి | బి.గుర్రప్ప, జిల్లా సహకార శాఖాధికారి | బి.పావని, ఆర్డీఓ, ఆత్మకూరు | షేక్ అబ్దుల్ ఖయ్యూమ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ | టి.విజయకుమార్, పరిపాలనాధికారి, కలెక్టరేట్ | శాంతకుమారి, తహసీల్దార్, కలెక్టరేట్ | పి.విజయకుమార్, తహసీల్దార్ (లీగల్ సెల్)



పి.చాణుక్య, సీసీ టు జాయింట్ కలెక్టర్ | బాలమురళి, ఎంవీఐ, రవాణా శాఖ | డాక్టర్ ఫణికుమార్, న్యూరోఫిజీషియన్, జీజీహెచ్ | డాక్టర్ రాజేశ్వరి, ప్రిన్సిపల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల | డాక్టర్ మస్తాన్ బాషా, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ | అల్లంపాటి పెంచలరెడ్డి, నుడా కార్యదర్శి | జహీరుద్దీన్ అహ్మద్, డీఈఈ | ఏవీఎస్ రవీంద్రబాబు, ఏపీఆర్‌ఓ | ఎస్‌వీ సూర్యనారాయణ, జీఎస్‌డబ్ల్యూఎస్



వేణుగోపాల్, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు | ఆద్విక రమ్య, రోలర్ స్కేటింగ్ ప్లేయర్ | సుదేష్ణ, డీఈ, నెల్లూరు నగరపాలక సంస్థ | శ్రీదేవి, బీసీ సంక్షేమ శాఖ, నెల్లూరు | రామనిర్మల, అకౌంటెంట్, కార్పొరేషన్ | అలేఖ్య, బీసీ కార్పొరేషన్ | ఆర్.ప్రదీప్ కుమార్, డీఆర్వో సీసీ | అబ్దుల్ ఖాదర్, క్యాంప్ డీటీ, జేసీ కార్యాలయం | షేక్ కాలేషా, పౌరసంబంధాల శాఖ

పోలీస్ శాఖలో..

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో విశిష్ట సేవలు, ధైర్య సాహసాలు ప్రదర్శించిన పోలీసు అధికారులు, సిబ్బందికి మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లు ప్రశంసాపత్రాలను అందజేశారు.



మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య | పి.సింధుప్రియ, నెల్లూరు నగర డీఎస్పీ | జి.శ్రీనివాసరావు, నెల్లూరు రూరల్ డీఎస్పీ | పి.శ్రీధర్, కావలి డీఎస్పీ | కె.వేణుగోపాల్, ఆత్మకూరు డీఎస్పీ | సీహెచ్‌వీ సుబ్రహ్మణ్యం, కందుకూరు డీఎస్పీ | ఎ.శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ | ఎం.గిరిధర్‌రావు, డీటీసీ డీఎస్పీ



చెంచురామారావు, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ | ఎస్.చంద్ర మోహన్, ఏఆర్ డీఎస్పీ | కె.అంకమరావు, అడ్మిన్ ఆర్ఐ | చిట్టెం కోటేశ్వర రావు, చిన్న బజారు ఇన్‌స్పెక్టర్ | ఎం.రోశయ్య, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ | జి.మంగారావు, గుడ్లూరు సీఐ | ఎం.రవినాయక్, కృష్ణపట్నం పోర్టు సీఐ | ఎస్.శ్రీనివాసులు, డీపీఓ సీనియర్ అసిస్టెంట్ | డి.వెంకటేశ్వర రావు, ఎస్‌బీ-1 ఇన్‌స్పెక్టర్



బి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టర్ | బి.రమేష్‌బాబు, దర్గామిట్ట ఎస్సై | పి.నాగరాజు, నార్త్ ట్రాఫిక్, నెల్లూరు | నజ్మల్, హెచ్‌సీ, చిన్నబజారు పోలీస్ స్టేషన్ | ఎ.పవన్ కుమార్, ఏఆర్‌పీసీ

సేవా పతకం అందుకున్న హోంగార్డ్స్ ఆర్ఐ

మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా జిల్లా హోంగార్డ్స్ ఆర్ఐ వై.పాల్‌రాజు సేవా పతకం అందుకున్నారు. ఆయనకు పోలీసు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



పాల్‌రాజు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

- రూ.20 లక్షల ఆస్తి నష్టం
- లబోదిబోమంటున్న బాధితులు



అగ్నికి ఆహుతైన సామగ్రి

వింజమూరు(ఉదయగిరి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆటో స్పేర్స్ దుకాణం దగ్ధమైంది. ఈ ఘటన వింజమూరు పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ సమీపంలో జరిగింది. స్థానికులు, బాధితుల కథనం మేరకు.. బుజ్జమ్మ కొన్ని సంవత్సరాలుగా ఆటో స్పేర్స్, వివిధ రకాల వాహనాలకు సీటు కవర్లు, ఆయిల్ విక్రయిస్తున్నారు. ఇటీవల భారీగా సరుకు నిల్వ ఉంచారు. శుక్రవారం ఉదయం దుకాణంలో ఉన్న ఒక గదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. మొత్తం సామగ్రి కాలిపోయింది. స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వారొచ్చి మంటలు ఆర్పారు. దీంతో చుట్టుపక్కల దుకాణాలకు మంటలు వ్యాపించలేదు. సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఏం కష్టమొచ్చిందో తెలియదు గానీ రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైలు కొద్దిదూరం లాక్కెళ్లడంతో ఛిద్రమై గుర్తుపట్టలేని విధంగా తయారైంది. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున మాగుంట లేఅవుట్ అండర్‌బ్రిడ్జి సమీపంలో నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై చోటుచేసుకుంది. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు ఉండొచ్చు. తెలుపు, గులాబీ రంగులు మిళితమైన హాఫ్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- జారిపడి..

గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడిన ఘటన శుక్రవారం బుజబుజనెల్లూరు సమీపంలో నెల్లూరువైపు వచ్చే పట్టాలపై చోటుచేసుకుంది. అతడిని రైల్వే ట్రాక్‌మెన్ జి.భార్గవ్‌బాబు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడు నలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ టీషర్టు, నలుపు రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఎస్.హరిచందన హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్



వాహన రికార్డులు పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాసులురెడ్డి



జాతీయ రహదారిపై వాహన తనిఖీలు

- నిబంధనల ఉల్లంఘనులకు భారీగా జరిమానాలు

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనల ఉల్లంఘనులపై కొరడా ఝుళిపించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్న 100 మందిపై కేసులు నమోదు చేసి రూ.1,06,500లు జరిమానా విధించారు. అదేక్రమంలో నేర నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లాలోని 54 లాడ్జీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బస చేసిన వారిని ఎక్కడి నుంచి వచ్చారు?, ఎందుకు వచ్చారు?, ఏం చేస్తున్నారు తదితర వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా వాహన తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. మితిమీరిన వేగం, ట్రిపుల్, మైనర్ రైడింగ్, ఓవర్‌లోడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు పాల్పడుతున్న వాహనచోదకులపై కేసులు నమోదుచేసి భారీగా జరిమానాలు విధిస్తున్నామన్నారు. వాహనచోదకులు విధిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరులో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. శుక్రవారం వారు వివరాలు వెల్లడించారు. దుత్తలూరు సెంటర్ సమీపంలో ఓ ఇంట్లో గురువారం రాత్రి బాల్య వివాహం జరుగుతుందని అధికారులకు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నాగరాజు ఐసీడీఎస్, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు ఆ ఇంటి వద్దకు చేరుకుని విచారణ జరిపారు. బాలికకు మైనార్టీ తీరకముందే వివాహం చేసేందుకు సిద్ధమవడంతో ఇరువర్గాల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలకు అతిక్రమించి వివాహం జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉదయగిరి ఎస్సై ఇంద్రసేనారెడ్డి, ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.120
లేయర్	రూ.118
బ్రాయిలర్ చికెన్:	రూ.220
స్కిన్‌లెస్ చికెన్:	రూ.244
లేయర్ చికెన్:	రూ.200

'నాన్నా.. నేనిక బతకను'

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుమారుడు
- తండ్రి 108 పైలట్
- అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మృతి
- మైనర్ బాలుడి నిర్వాకం



సుబ్రహ్మణ్యం (ఫైల్)

పొదలకూరు: ఆ యువకుడు కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. ఇంతలో రోడ్డు ప్రమాదం జరిగింది. 108 పైలట్‌గా వెళ్తున్న తండ్రి కుమారుడిని తన అంబులెన్స్‌లో తరలిస్తుండగా తుదిశ్వాస విడిచిన హృదయ విషాదరక ఘటన గురువారం రాత్రి మరుపూరు వద్ద జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పొదలకూరు శింగయ్య చేనువీధికి చెందిన మందాటి సురేష్ ఆదూరుపల్లి 108 అంబులెన్స్ పైలట్. ఎంతో మంది ప్రాణాలను కాపాడాడు. ఆయన పెద్ద కుమారుడు మందాటి బాలసుబ్రహ్మణ్యం (20) సొంతంగా కారు నడుపుతూ కుటుంబానికి అండగా ఉన్నాడు. చిన్న కుమారుడు చదువుకుంటున్నాడు. గురువారం రాత్రి బాలసుబ్రహ్మణ్యం తన కారులో నెల్లూరుకు డ్రాపింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. సురేష్ ఒకరిని నెల్లూరు ఆస్పత్రిలో చేర్పి వస్తూ కుమారుడి కారును చూశాడు. అంబులెన్స్, కారు పొదలకూరుకు బయలుదేరాయి. డక్కిలి మండలం వెలికల్లు గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలుడు నెల్లూరు వైపు అతి వేగంగా కారులో వెళ్తున్నాడు. సురేష్ అంబులెన్స్‌ను బాలుడి కారు ఢీకొనే క్రమంలో ప్రమాదం తప్పింది. తన కుమారుడి కారు వెనుక వస్తున్నందున సురేష్ వెంటనే ఫోన్ చేశాడు. అతను లిఫ్ట్ చేయకపోవడంతో మళ్లీ చేశాడు. మరో యువకుడు ఫోన్ లిఫ్ట్ చేసి కారు ప్రమాదం జరిగినట్లు చెప్పాడు. సురేష్ వెంటనే అంబులెన్స్‌ను వెనక్కు తిప్పి ఘటనా స్థలానికి వెళ్లాడు. మరుపూరుకు సమీపంలో మద్యం తాగి అతివేగంగా వెళుతున్న బాలుడు బాలసుబ్రహ్మణ్యం కారును ఢీకొనడంతో దెబ్బతింది. తీవ్రంగా గాయపడిన కుమారుడిని సురేష్ నెల్లూరుకు తరలిస్తూ డైకస్ రోడ్డు వద్దకు చేరుకున్నారు. బాలసుబ్రహ్మణ్యం తన తండ్రితో 'నాన్నా నేను ఇక బతకను' అంటూ తుదిశ్వాస విడిచాడు. మైనర్‌కు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయాయి. క్షతగాత్రుడిని పొదలకూరు పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై హనీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.